

యాదగిరీశుడికి
నిత్యకైంకర్యాలు
- గజవాహన సేవ
- నేడు గిరిప్రదక్షిణ
- స్వాతి జన్మనక్షత్ర పూజాలు

7

రూ.525 కోట్లు
రైతులు కోల్పోయిన బోనస్

సన్న ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల మాయాజాలంతో రైతులు నష్టపోయారు. తేమశాతం నిబంధనను అడ్డుపెట్టుకుని రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకుండా మిల్లర్లు దగా చేశారు. మిల్‌పాయింట్ వద్ద విక్రయించడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.500 బోనస్ కూడా రైతులు కోల్పోయారు. మిల్లర్ల ఎత్తుగడలకు రైతులు నష్టపోగా, నిబంధనల చట్రంలో అధికారులు నిస్సహాయస్థితిని ఎదుర్కొన్నారు. అన్నీ తెలిసిన ప్రజాప్రతినిధులు సైతం రైతుల ప్రయోజనాలను కాపాడలేకపోయారు. వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సన్నధాన్యం సాగు కాగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల కంటే మిల్లుల వద్దే రైతులు ధాన్యాన్ని విక్రయించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)



- దగాపడ్డ ధాన్యం రైతు
- మిల్లులకే సన్న ధాన్యం విక్రయం
- ఉమ్మడి జిల్లాలో 21,506 మెట్రిక్‌టన్నుల సన్నధాన్యం కొనుగోలు
- మిల్‌పాయింట్లు వద్ద 10లక్షల మెట్రిక్‌టన్నుల కొనుగోళ్లు

రాష్ట్ర ప్రభుత్వం సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ఈ సీజన్‌లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అత్యధికంగా సన్న ధాన్యం సాగుచేసిన రైతులు మిల్లర్లకు విక్రయించి బోనస్ ప్రయోజనం పొందలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో 16,08,480 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉత్పత్తి అయింది. అందులో కనీసం సగం ధాన్యమైనా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నది లక్ష్యం. సుమారు రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండగా, ఉమ్మడి జిల్లాలో 150కి పైగా కేంద్రాలను ప్రత్యేకంగా సన్నధాన్యం కొనుగోలుకు కేటాయించారు. కాగా, ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో కేవలం 21,506 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేశారు. సూర్యాపేట జిల్లాలో 11,360 మెట్రిక్‌టన్నులు, నల్లగొండ జిల్లాలో 8,001,యాదాద్రి జిల్లాలో 2,145 మెట్రిక్‌టన్నుల సన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అందుకు రైతులకు రూ.10.75కోట్ల బోనస్ అందనుంది. అదే సమయంలో మిల్‌పాయింట్ల వద్ద రైతులు సుమారు 10.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. మిల్‌పాయింట్ల వద్ద విక్రయించడంతో రూ.525 కోట్ల విలువైన బోనస్‌ను రైతులు

- మిగతా 6వ పేజీలో



జిల్లా	సాగువిస్తీర్ణం (ఎకరాలు)	దిగుబడి అంచనా (మెట్రిక్‌టన్నులు)	సన్నధాన్యం	దొడ్డుధాన్యం	ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం	కొనుగోలు చేసిన ధాన్యం	కొనుగోలు కేంద్రాలు
నల్లగొండ	5,15, 235	12,01,540	6,36,816	5,64,724	6,00,000	1,74,490	375
యాదాద్రి	2,80,540	6,16,521	70,364	5,46,157	3,08,000	1,91,463	296
సూర్యాపేట	4,72,934	11,10,850	9,01,300	2,09,550	4,00,000	1,18,076	294
మొత్తం	12,68,709	29,28,911	16,08,480	13,20,431	13,08,000	4,84,029	965



7న నల్లగొండకు సీఎం రేవంత్‌రెడ్డి

- బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, మెడికల్ కళాశాల భవనాన్ని ప్రారంభించనున్న సీఎం
- యాదాద్రి పవర్‌ప్లాంట్‌పై ఖరారుకాని షెడ్యూల్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటన ఖరారైంది. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 7వ తేదీన ఆయన పర్యటిస్తారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. సీఎం పర్యటన సందర్భంగా బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు, మెడికల్ కళాశాల భవనం ప్రారంభోత్సవాలతో పాటు, పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉండనున్నాయి. సీఎం పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు పెండింగ్ పనులను పూర్తిచేయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సుమారు 18 ఏళ్ల క్రితం బ్రాహ్మణవెల్లెంల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీటి పనులు 80శాతం మేర పూర్తయ్యాయి. ఆ తరువాత ప్రభుత్వం మారడం, గత పదేళ్లలో ఈ పథకం చివరి దశలో పనుల్లో వేగంపెంచినా ఆశించిన ప్రయోజనం దక్కలేదు. నామమాత్రంగా పంపులు, మోటర్లు ప్రారంభించారేతప్ప పనులు ముందుకుసాగలేదు. తిరిగి ప్రభుత్వం మారడం, వెంకట్‌రెడ్డి మంత్రికావడంతో ఈ పథకం పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. ఇటీవల మంత్రి రెండు పర్యాయాలు ప్రాజెక్టును సందర్శించడంతో పాటు, కాల్వల పనులను వేగవంతం చేసేలా కలెక్టర్, సాగునీటి పారుదలశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతోపాటు నిధులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పనులు వేగంగా సాగుతుండడంతోపాటు మొదటిదశలో అనుకున్నమేర పనులు పూర్తవడంతో సీఎం పర్యటనలో ఆయన ద్వారా కాల్వలకు నీటి విడుదల చేయించాలని సంకల్పించారు. ఆ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో అంతర్భాగంగా చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల-ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని లక్ష ఎకరాలకు సాగు నీరందుతుంది. నల్లగొండ సమీపంలోని పానగల్‌లోని ఉదయ సముద్రం రిజర్వాయర్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల వద్ద నిర్మించిన రిజర్వాయర్‌కు నీటిని తరలించి, అక్కడి నుంచి కుడి, ఎడమకాల్వల ద్వారా లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరిచ్చేలా పథకాన్ని

- మిగతా 6వ పేజీలో

విద్యార్థులతో మంత్రి ఉత్తమ్ ముఖాముఖి నేడు

● జూనియర్ కళాశాలను పరిశీలించిన ఆర్డీవో



పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

హుజూర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులతో మంత్రి ఉత్తమ్ ముచ్చటించనున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నియోజకవర్గ పర్యటన సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలను గురువారం ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. మంత్రి ఉత్తమ్ జూనియర్ కళాశాల ఆవరణలో హెలిక్యాప్టర్ దిగిన అనంతరం శుక్రవారం ఉదయం రెండు కళాశాలల విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొననున్నారు. గతంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు సుమారు రూ.కోటి విలువైన కంప్యూటర్ల కోసం మంజూరు చేశారు. కాగా ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు అధిక ప్రాధాన్యం కల్పించేలా మంత్రి ఉత్తమ్ పర్యటన సాగుతుంది. మంత్రి కళాశాలకు వస్తున్న నేపథ్యంలో ఆయా కళాశాలలను ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, యరగాని గురవయ్యగౌడ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో నేడు మంత్రి ఉత్తమ్ పర్యటన



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం హుజూర్‌నగర్‌లో పర్యటించనున్నారు. మంత్రి ఉత్తమ్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ఉదయం 7.40 నిమిషాలకు బయలుదేరి 8.15 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో 9 గంటలకు హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుకుంటారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలను పరిశీలిస్తారు. కళాశాలల్లో నిర్మాణ, అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. అనంతరం గరిడేపల్లి మండలం అలింగాపురంలో రూ.30కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ పనులకు మంత్రి ఉత్తమ్ శంకుస్థాపన చేయనున్నారు. అక్కడి నుంచి నేరేడుచర్ల మునిసిపాలిటీలో 11 గంటల నుంచి 12 గంటల వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో సమావేశంలో పాల్గొననున్నారు. 12 గంటలకు వ్యవసాయమార్కెట్ యార్డ్ నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి ఉత్తమ్ పాల్గొనేందుకు బయలుదేరి వెళ్తారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : డీఎస్పీ

సూర్యాపేటక్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రతీఒక్కరు పోలీసులకు సహకరించాలని సూర్యాపేట డీఎస్పీ జి.రవి అన్నారు. గురువారం పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రణను పరిశీలించి మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత ట్రాఫిక్ పెరిగిందన్నారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలపవద్దన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ముగ్గురు సీఐల బదిలీ

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ గురువారం బదిలీ ఉత్తర్వులు జారీచేశారు. సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పి. వీరరాఘవులును సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా, ఇప్పటివరకు సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గురుకుల రాజశేఖర్‌ను సూర్యాపేట రూరల్ సీఐగా బదిలీ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐగా పనిచేస్తున్న వై.సురేందర్‌రెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా న్యాయాధికారి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేటలీగల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా చైర్మన్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల లోక్‌అదాలత్ సన్నాహక సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ పి.శ్రీవాణి, జిల్లా మొదటి అదనపు జడ్జి ఎం.శ్యాంశ్రీ, అదనపు మొదటి జూనియర్ సివిల్ జడ్జి అపూర్వరవళి, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

● వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలి ● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రీ, పోస్ట్‌మెట్రిక్ సంక్షేమ హాస్టళ్ల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహాల అధికారులు స్థానికంగా ఉంటూ ప్రతీ రోజు సందర్శించాలన్నారు. వసతిగృహాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఫిల్టర్ చేసిన తాగునీటిని అందించాలన్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే వసతి గృహాలకు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే వాటిని సరి చేయించాలన్నారు. వసతి గృహాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఆహారం తయారు చేసిన తర్వాత విధిగా ఫుడ్ కమిటీ సభ్యులు పరిశీలించాలన్నారు. వసతి గృహాల్లో ర్యాగింగ్ సమస్య లేకుండా చూసుకోవాలని, ప్రతీ వసతిగృహంలో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా సంక్షేమాధికారులు శంకర్, లత, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

సూర్యాపేట సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సీపీఎం సూర్యాపేట జిల్లా తృతీయ మహాసభలను నిర్వహించడానికి ఆ పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ నెల 29 నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు జిల్లా కేంద్రంలో ఈ మహాసభలను నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు సీసీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి హాజరుకానున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి తెలిపారు. ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో నిర్వహించే మహాసభల ప్రారంభ సభను విజయవంతం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాకేంద్రంలోని ప్రధాన కూడళ్లలో సీపీఎం జెండాలు, తోరణాలు, వాల్ పెయింటింగ్‌లు, ఫ్లెక్సీలతోపాటు అలంకరణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేశారు.



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న రాంబాబు

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

ఆత్మకూర్(ఎస్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఒకేచోట నిర్వహించాలని, వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించి రైతులను ఇబ్బందిపెట్టొద్దని అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని పాత సూర్యాపేట, కోటినాయక్‌తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేసి, ఎగుమతి చేయాలన్నారు. ధాన్యం డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆత్మకూర్(ఎస్)లోని రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల జరిగిన కులగణన సర్వే డేటా ఎంట్రీని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిచంద్రప్రసాద్, ఏపీఎం మంజుల ఆర్‌ఐ స్వప్న, ఏఈవో శివకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

(ఆంధ్రజ్యోతి, మోతె): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా త్వరగా కాంటాలు వేయాలని ఆర్డీవో వేణుమాదవ్ అన్నారు. మండల పరిధిలోని నామవరం, మోతె, రాఘవాపురం, భల్లు తండ గ్రామాల్లో ఐకేపీ, సహకార సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యంకొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కాంటాలు వేయడంతోపాటు త్వరగా బిల్లులు చెల్లించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ, వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బందితో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఏవో అరుణ, ఏపీఎం వెంకయ్య, సీసీలు, ఏఈవోలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

● ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

సూర్యాపేటఅర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన అవసరమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఐఏఎల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది అమరవీరుల పోరాటంతో రాజ్యాంగం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. చట్టపరమైన మార్పులతోపాటు అభివృద్ధి చట్టాల మార్పుపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, దప్పు మల్లయ్య, గుడిపూడి వెంకటేశ్వర్‌రావు, బొమ్మగాని శ్రీనివాస్, తొగిటి మురళి, సత్యనారాయణపిళ్ళె, బిక్షమయ్యగౌడ్, కొంపెల్లి లింగయ్య, కాకిరాంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్

వేతనాల కోసం ఎదురుచూపులు

- ఆరోగ్యమిత్రలకు నాలుగు నెలలుగా అందని వైనం

7



మేమున్నామని.. మీకేం కాదనీ...

- సత్ఫలితానిస్తున్న షీ టీమ్స్
- ఉమ్మడి జిల్లాలో 184 వేధింపు కేసుల్లో కౌన్సిలింగ్
- విద్యా సంస్థల్లో 483 అవగాహన సదస్సులు

రాష్ట్రంలోని మహిళల రక్షణ, భద్రత కోసం గత ప్రభుత్వం షీ టీమ్స్‌ను ఏర్పాటుచేసింది. విద్యార్థినులపై వేధింపులు, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే పోకిరీలను చట్టప్రకారం శిక్షించడం, ఈవ్‌టీజర్ల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, మళ్లీ వేధింపులకు పాల్పడితే కేసులు నమోదు చేయడం షీటీం ముఖ్య విధి. కాగా జిల్లాలో షీటీమ్స్ ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. సుమారు 198 మంది ఆకతాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చి, 20 మందిపై కేసులు నమోదు చేశారు.

(ఆంధ్రజ్యోతి- సూర్యాపేట క్రైం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యార్థినులు, మహిళలపై యువకుల వేదింపులు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల ప్రాంతాల్లో షీ టీమ్స్ ఆధ్వర్యంలో సిబ్బంది పెట్రోలింగ్ చేస్తూ విద్యార్థినులు, మహిళలు నిత్యం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నారు. సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి జిల్లా కేంద్రాలతో పాటు కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ, నకిరేకల్, చౌటుప్పల్, హాలియా, రామన్నపేట, ఆలేరు, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల, దామరచర్ల, గరిడేపల్లి, మేళ్లచెర్వు, నార్కట్‌పల్లి ప్రాంతాల్లో విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. అయితే సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్ వారి వారి సబ్‌డివిజన్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాంతో మంచి ఫలితాలు వచ్చాయి. కాగా, సూర్యాపేట షీ టీమ్ చేపట్టిన కార్యక్రమాలకు రెండేళ్ల కిందట రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు లభించింది.





సూర్యాపేటలోని సాయిగౌతమి జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సూర్యాపేట షీటీమ్ ఎస్‌ఐ నీలిమ(ఫైల్)

భరోసా కల్పిస్తున్న పోలీసులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు అమ్మాయిలపై వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు 184 వరకు వచ్చాయి. సంబంధిత యువకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలో షీటీమ్స్ ఈ ఏడాదిలో ఇప్పటివరకు 483 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అమ్మాయిలు, మహిళలను వేధించే 198 మంది ఆకతాయిలకు పోలీస్ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కొంత మంది ఆకతాయిల్లో మార్పు రాకపోగా పదే పదే వేధింపులకు పాల్పడటంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 20మందిపై కేసులు నమోదుచేశారు. దీంతో పాటు భార్యాభర్తల మధ్య తగాదాలకు సంబంధించి 436 మంది దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

వేధింపులకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

జిల్లాలో మహిళలు, అమ్మాయిలను వేధించే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతాం. విద్యార్థినులు, మహిళల రక్షణ కోసమే షీటీమ్స్ పనిచేస్తున్నాయి. ఏమైనా ఇబ్బందులు కలిగితే వెంటనే సమాచారమివ్వాలి. ఆకతాయిల వేధింపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తాం. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలి. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే జిల్లా షీ టీమ్ నంబర్ 8712686056, డయల్-100కు సమాచారం ఇవ్వాలి.



సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ, సూర్యాపేట జిల్లా

ఇప్పటికీ అపురూపమే

▸▸ వాహనాలు, వస్తువులు దశాబ్దాలుగా వారి జీవితంలో భాగం

ప్రతీ ఒక్కరి జీవితంలో సెంటిమెంట్ అనేది ప్రబలమైన మానసిక ఆత్మస్థైర్యాన్ని నింపే పునాది. ముఖ్యమైన పనిమీద వెళ్లేటప్పుడు కొందరు తల్లినో, భార్యనో, కుమార్తెనో ఎదురు రమ్మంటారు. ఇంకొందరు ఇష్టదైవాన్ని తలుచుకుని పనులు ప్రారంభిస్తారు. అలా సెంటిమెంట్ కుటుంబ సభ్యులపైనే కాదు ఇష్టమైన వాహనాలు, వస్తువులు, పరికరాలతో కూడా ఉంటాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో ఇలాంటి వారు ఉన్నారు. తమ జీవిత ప్రయాణంలో విజయాలను అందించిన వస్తువులు, వాహనాలపై అవ్యాజమైన విశ్వాసాన్ని, ఇష్టాన్ని పెంచుకుని, అపురూపంగా దాచుకున్నారు. వస్తువులు వ్యక్తుల జీవితాల్లో ఒకటిగా మారిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

మోహన్‌రెడ్డి కుటుంబంలో కారూ ఓ భాగం



నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి వద్ద 55 ఏళ్ల నాటి అంబాసిడర్ కారు ఉంది.ఆయన ఎంపీఐగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న సమయంలో బంధువు మాజీ ఎంపీ బీఎన్‌రెడ్డితో కలిసి అప్పటి సీఎం మర్రి చెన్నారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ పార్క్ చేసిన ఏపీఎఫ్-4344 నెంబర్ గల 1968 మార్క్-3 మోడల్ అంబాసిడర్ కారు మోహన్‌రెడ్డిని ఆకర్షించింది. సీఎం హోదాలో చెన్నారెడ్డి కొన్నాళ్ల పాటు అదే కారులో ప్రయాణించారు కూడా. తర్వాత ప్రభుత్వ వాహనాలు సమకూరడంతో కారును ఇంటి వద్దే ఉంచారు. కారు నిరుపయోగంగా ఉంటుందని తెలిసి బీఎన్‌రెడ్డి జోక్యంతో 1979లో రూ.11,000లు వెచ్చించి అంబాసిడరును మోహన్‌రెడ్డి కొనుగోలుచేశారు. 30ఏళ్ల పాటు కుటుంబ పరివారమంతా అందులో ప్రయాణించారు. ఆ కారు వినియోగిస్తున్న సమయంలోనే పదోన్నతి పొందడం, సోదరులు రాజకీయాల్లో ఎదగడంతో మోహన్‌రెడ్డికి ఆ కారుపై ఇష్టం సెంటిమెంట్‌గా మారింది. 2008 వరకు సేవలందించిన ఆ కారుపై మమకారం వదులుకోలేక కారును ప్రస్తుతం ఫాంహౌస్‌లోనే ఓ జ్ఞాపకంలా భద్రంగా ఉంచారు.

ఆ స్కూటర్‌పై వెళ్తే..





నార్కట్‌పల్లికి చెందిన బూర్గు జనార్దన్ వ్యాపారస్తుడు. తాను వ్యాపారం ప్రారంభించిన 1980లో బజాజ్ కంపెనీకి చెందిన చేతక్ స్కూటర్‌ను కొన్నారు. ఆ వాహనంపై వెళ్లిన ప్రతీ పని విఘ్నం లేకుండా పూర్తయ్యేది. ఏ వ్యాపారి వద్దకు వెళ్లినా, ఏ వ్యాపారం చేసినా లాభమే జరిగేది. పైగా ఆచేతక్ స్కూటర్ కొని 36 ఏళ్లు కావస్తున్నా ఏనాడు ప్రమాదం జరిగింది లేదు. దీంతో అది ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. ఇప్పటికీ అదే స్కూటర్‌పైనే ఆయన ప్రతీ వ్యాపారానికి, ప్రతీ చోటికి వెళ్తుంటారు.

33 ఏళ్లుగా అదే కత్తెర



నార్కట్‌పల్లికి చెందిన బండారు సందీప్ వస్త్ర వ్యాపారి. 33 ఏళ్ల కిందట తన చిన్నతనంలో తాత, తల్లిదండ్రులు వస్త్ర వ్యాపారం ప్రారంభించినప్పుడు వస్త్రం కత్తిరించేందుకు ఓ కత్తెర కొన్నారు. నేటికీ 3 తరాలుగా అదే కత్తెరను వాడుతున్నారు. వస్త్ర వ్యాపారం ప్రారంభించిన తొలినాళ్లలో తమ తాత కూడా ఇదే కత్తెర వాడారు. తన తాత తర్వాత వస్త్రవ్యాపారంలో దిగిన తన తండ్రి కూడా ఆ కత్తెరనే వాడారు. ప్రస్తుతం సందీప్ కూడా ఇదే కత్తెరను వాడుతున్నారు. అవసరాల కోసం కొత్త కత్తెరలను కొన్నా ఆ పాత కత్తెరను ఎక్కువగా వాడుతుంటారు. ఈ కత్తెరను తమకు సెంటిమెంటుగా భావిస్తున్నట్లు సందీప్ తెలిపారు.

మరమ్మతులకు గురైనా ఇంటి వద్దే...





నార్కట్‌పల్లికి చెందిన పబ్బతి ప్రసాద్ వ్యాపారం మొదలుపెట్టిన 16 ఏళ్ల కిందట ఓ ట్రాలీ ఆటో కొన్నారు. దాదాపు 14 ఏళ్ల పాటు ఆ ఆటో ద్వారా వ్యాపారానికి సంబంధించిన నిత్యావసరాలు రవాణా చేస్తుండేది. ఆ ఆటోను ఉపయోగిస్తూ సరుకుల రవాణా చేస్తూ కొనసాగించిన వ్యాపారం కుటుంబ ఆర్థిక పరిస్థి తి మెరుగుపడేందుకు దోహదపడింది. దీంతో ఆ ఆటో అంటే వారికి సెంటిమెంట్‌గా మారింది.ప్రస్తుతం ఆ ఆటో మరమ్మతులకు గురై నడిపించేందుకు కొంత ఇబ్బంది ఉన్నా ఆ ఆటోను అలాగే వాడుతున్నారు తప్ప విక్రయించడం లేదు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



పర్వతం సరిత,



గుంట మాన్వి

కట్టంగూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెరువుఅన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 29నుంచి డిసెంబరు 1వ వరకు నిజమాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరపున 10వ తరగతి విద్యార్థినులు పర్వతం సరిత, గుంట మాన్వి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కందాల రమ, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతమల్ల పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినుల ఎంపికపై ఉపాధ్యాయులు రాంమోహన్‌రెడ్డి, శ్రీనివాస్, కోటిలింగం, నరహరి, నగేష్, సంపత్‌కుమార్, మంగ హర్షం వ్యక్తం చేశారు.

● కనగల్ : నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీ.యెడవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని దీక్షిత జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ తెలిపారు. దీక్షితను ఉపాధ్యాయులు కవిత, నారాయణ అభినందించారు.



దీక్షిత

హుజూర్‌నగర్ వాసికి కర్మవీర్ చక్ర అవార్డు



రంజిత్‌కుమార్

హుజూర్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన దుంగుంట్ల రంజిత్‌కుమార్ కర్మవీర్‌చక్ర అవార్డును అందుకున్నారు. ఈ నెల 25 నుంచి 27వరకు ఢిల్లీలో జరిగిన రెక్స్ కాన్‌క్లేవ్ ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్‌లో ఎన్‌జీవో (ఐకాంగో), ఐక్యరాజ్య సమితి(యూఎన్) సంయుక్తంగా అందించే జాతీయస్థాయి అవార్డును రంజిత్ అందుకున్నారు. అనేక సంవత్సరాలుగా స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నందున తనకు ఈ అవార్డు లభించిందన్నారు.

మాలధారులకు మూడేళ్లుగా అన్నసమారాధన

హాలియా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి మాలధారులు కఠిన నియమాలను పాటిస్తుంటారు. మధ్యాహ్నం భుజించే ఆహారాన్ని వారు దేవుడి ప్రసాదంగా భావిస్తుంటారు. వ్యవహారికంలో భిక్షగా పలుకుతుంటారు. భిక్షను కూడా ఎక్కడపడితే అక్కడ చేయరు. శుచి, శుభ్రతతో చేసిన చోటుతో పాటు కూర్చుని తినడం నియమం. ఈ క్రమంలో తమ జీవనోపాధి పనులను చూసుకుంటూనే ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తున్న మాలధారులకు నల్లగొండ జిల్లా హాలియాకు చెందిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ శక్తి జాగరణ సమితి ఆధ్వర్యంలో మూడేళ్లుగా అన్నసమారాధన(అన్నదానం) చేస్తున్నారు. అన్నం పరబ్రహ్మస్వరూపంగా భావిస్తూ ఆధ్యాత్మిక మార్గంలోని వారికి అండగా నిలుస్తున్నారు.



అన్నసమారాధనకు హాజరైన భక్తులు, ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మోహన్‌రావు

మూడేళ్లుగా

గత మూడేళ్లుగా హాలియాలోని శ్రీభక్తాసీతారామాంజనేయ స్వామి దేవాలయంలో కార్తీకమాసంలో 41 రోజులు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తూ అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం, హనుమాన్ శక్తి జాగరణ సమితి బాధ్యులు స్వాములు, పురప్రముఖుల మన్ననలను పొందుతున్నారు. ఈ నెల 2న ప్రారంభమైన అన్నసమారాధన డిసెంబరు 12న ముగించనున్నారు. ప్రతి రోజూ 1000 మందికి రెండు క్వింటాళ్ల బియ్యం వండి వడ్డించడం నిత్యకృత్యంగ దిగ్విజయంగా జరుగుతోంది. వీరి కృషితో ఆధ్యాత్మికం వైపు మళ్లించేందుకు దోహదపడుతుండటంతో హాలియాలో వివిధ స్వాముల మాలధారుల సంఖ్య ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరిగింది.

సన్మార్గంలో నడిపేందుకు కృషి

గ్రామీణప్రాంతంలోని నిరుపేదలను ఆధ్యాత్మికం వైపు మళ్లించి సన్మార్గంలో నడిపించేందుకే ఎంతశ్రమైనా అన్నసమారాధన నిత్యం కొనసాగిస్తున్నాం. పనులతో బిజీగా ఉండే స్వాములు మధ్యాహ్నం వారి పనులకు ఆటంకం కలగకుండా నిత్యఅన్నసమారాధన తోడ్పడుతోంది. దీంతో ప్రతి ఏడాది భక్తుల సంఖ్య పెరిగి వారి వారి కుటుంబాలోట్ల ఆనందం వెల్లివిరుస్తోంది. అన్నసమారాధనకు సహకరిస్తున్న దాతల మేలు మరువలేనిది.



మేడేపల్లి మోహన్‌రావు, గురుస్వామి

దాతృత్వం అభినందనీయం

అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం నిర్వాహకుడు మేడేపల్లి మోహన్‌రావు దాతలను చైతన్యపరచడంతో మేము న్నామంటూ ముందుకు వస్తున్నారు. ప్రతి రోజూ రూ.35వేలు అన్నసమారాధనకు ఖర్చవుతుంది. ఈ ఏడాది చిట్టిపోలు యాదగిరి 25 క్వింటాళ్ల బియ్యం, రేపాల వెంకన్న 25 క్వింటాళ్లు, బుసిరెడ్డి పాండురంగారెడ్డి 5 రోజులు, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి రెండు రోజులు, చెరుకూరి కిరణ్‌కుమార్, సంతోష్‌జ్యూలరీ, వీ.కావేరీ ట్రావెల్స్, మహేష్, గురవయ్య, హనుమాన్‌ప్రసాద్, గౌతమ్, తిమ్మయ్య, వెంకయ్యచౌదరి, కొడాలి శివలు ఒక రోజుకి అన్నసమారాధనకు చేయూతనందించారు. వీరితో పాటు మరెందరో వారి శక్తి మేరకు దాతలుగా వ్యవహరిస్తున్నారు.

శ్రమిస్తున్న కరసేవకులు

41రోజుల పాటు 1000 మంది స్వాములకు రెండు క్వింటాళ్ల బియ్యం వండించి వారికి వడ్డించేందుకు కరసేవకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మోహన్‌రావు పీఠంలో సభ్యులుగా వ్యవహరిస్తున్న భాస్కర్‌రెడ్డి, చిననారాయణ, శ్రీనివాస్, మధు, శ్రీరాములు, నర్సిరెడ్డిలు నిత్యం స్వామి సేవలో భాగంగా అన్నసమారాధన కోసం తమ సమయాన్ని వెచ్చించి స్వాములను కింద కూర్చోబెట్టి భోజనం వడ్డించడంలో శ్రమిస్తున్నారు.

రైతులు కోల్పోయిన బోనస్ రూ.525కోట్లు

(5వ పేజీ తరువాయి)

వదులుకోవాల్సి వచ్చింది.

కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

ఉమ్మడి జిల్లాలో దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 4,62,523 మెట్రిక్‌టన్నుల దొడ్డు ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేశారు. అందుకు మొత్తం రూ.1075.44కోట్లు డబ్బు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.815.14 కోట్లు చెల్లించారు. కొనుగోలు కేంద్రాలను డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగిస్తామని, రైతుల వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు చేశాకే కేంద్రాలను మూసివేస్తామని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గ్రేడ్-1 ధాన్యానికి క్వింటాకు రూ.2,320 ధర ఇస్తుండగా, కామన్ రకాలకు రూ.2,300 ధర చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దనే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని నాణ్యతా ప్రమాణాల మేరకు తేమశాతం వచ్చాకే కేంద్రాల నిర్వాహకులు కాంటాలు వేస్తున్నారు.

కేంద్రాల్లో విక్రయించాలని చెప్పినా రైతులు వినలేదు

సన్న ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని కలెక్టర్ సహా మేమంతా రైతులకు వివరించినా పట్టించుకోలేదు. మిల్లుల వద్ద కనీస మద్దతు ధర ఇవ్వకుండా కొనుగోలు చేస్తే కఠినచర్యలు తీసుకుంటున్నాం. తేమ శాతం పట్టించుకోకుండా మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని రైతులు నేరుగా అక్కడికే ధాన్యం తరలించారు. పంటకు మద్దతు ధర ఇప్పించడంతో పాటు, ప్రభుత్వ కేంద్రాల్లో సన్న ధాన్యం విక్రయిస్తే బోనస్ ఇస్తున్నాం. తేమ 17శాతానికి మించకుండా, తాలు, నాణ్యతాప్రమాణాలు పాటించి, ధాన్యం తీసుకువస్తే వెంటనే కాంటాలు వేయించి రైతులకు 48గంటల్లో డబ్బు జమ చేస్తాం. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేవు.

వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్లగొండ

● గత్యంతరం లేక మిల్లులో విక్రయించా



నేను 14 ఎకరాల్లో వరి సాగుచేశా. సగం చింట్లు, సగం హెచ్‌ఎంటీ. రెండూ సర్టిఫైడ్ సన్న రకాలే. మొత్తం 413 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. తేమ ఎక్కువగా ఉందని ప్రభుత్వ కేంద్రంలో కొనుగోలు చేయకపోవడంతో మిల్లులకు విక్రయించా. చింట్లు రకానికి క్వింటాకు రూ.2,200 ధర రాగా, హెచ్‌ఎంటీ రకానికి రూ.2,350 ధర చెల్లించారు. చేసేదీ లేక విక్రయించి వచ్చా. సుమారు రూ.2లక్షల వరకు ప్రభుత్వ బోనస్ కోల్పోతున్నామని తెలిసినా, గత్యంతరం లేకే మిల్లులకు విక్రయించా. మిల్లర్లు ఎంత తేమ శాతం ఉన్నా ధాన్యం కొనుగోలుచేస్తున్న విషయాన్ని ప్రభుత్వం పరిశీలించి రైతులకు న్యాయం చేయాలి.

వలిశెట్టి అంజనేయులు, మర్రిగూడెం, త్రిపురారం మండలం

తొలి ప్రయత్నంలోనే..

● ఏపీలో సివిల్‌జడ్జిగా ఎంపికైన తేజస్విని



తల్లిదండ్రులు ఈశ్వర్, మంగతో తేజస్విని

కొండమల్లేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కొడమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన నూతనగంటి తేజస్విని మొదటి ప్రయత్నంలో సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి ఫలితాల్లో నాన్‌లోకల్ కేటగిరీలో తన తొలి ప్రయత్నంలోనే ఎంపికయ్యారు. కొండమల్లేపల్లిలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్న నూతనగంటి ఈశ్వర్, మంగ దంపతులకు కుమారుడు కిరణ్‌తో పాటు కుమార్తె తేజస్విని ఉన్నారు. తేజస్విని పదో తరగతి వరకు కొండమల్లేపల్లిలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చదివారు. ఆపై నల్లగొండలోని గీతాంజలి కళాశాలలో ఇంటర్ చదివిన తేజస్విని తదుపరి నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం గతేడాది ఢిల్లీలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశారు. జడ్జి కావాలన్న లక్ష్యంతో చదివిన తేజస్విని జడ్జి ఉద్యోగం కోసం తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫలితాలు విడుదల కాగా జూనియర్ సివిల్ జడ్జిగా తేజస్విని ఎంపికయ్యారు. కాగా ఆమె సోదరుడు కిరణ్ బీటెక్ పూర్తి చేసి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. సివిల్ జడ్జిగా తేజస్విని ఎంపికపై కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

7న నల్లగొండకు సీఎం

(5వ పేజీ తరువాయి)

రూపొందించారు. నార్కట్‌పల్లి, నల్లగొండ, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, కట్టంగూరు మండలాలకు పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. మొదటి దశలో ఈ ప్రాజెక్టు కింద కుడి ప్రధాన కాల్వ రెండో డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 18వేల ఎకరాలకు, ఎడమ ప్రధాన కాల్వ డిస్ట్రిబ్యూటరీ-2 పరిధిలో 31,390 ఎకరాలు మొత్తం 49వేల పైచిలుకు ఎకరాలకు నీరివ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు యుద్ధప్రాతిపాదికన సాగుతున్నాయి. ప్రధాన కాల్వ కింద డిస్ట్రిబ్యూటరీ-1, కుడిప్రధాన కాల్వ కింద డిస్ట్రిబ్యూటరీ-2 పనులు పూర్తిచే సేందుకు పనులుచేపట్టారు. 18.575కిలోమీటర్ల ఎడమ ప్రధాన కాల్వలో పెండింగ్ పనులు, దీని పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ-1లో 18కిలోమీటర్ల కాల్వ పనుల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 12కిలోమీటర్ల కాల్వ తవ్వకం పనులు సాగుతున్నాయి. అదేవిధంగా కుడి ప్రధాన కాల్వ 25 కిలోమీటర్లలో పెండింగ్ పనులకు అవసరమైన భూసేకరణ, దీని పరిధిలో నిర్మాణంలో ఉన్న డిస్ట్రిబ్యూటరీ-2 కింద 22కిలోమీటర్ల కాల్వ నిమిత్తం అవసరమైన భూసేకరణతోపాటు కాల్వల నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు.



రూ.275కోట్లతో మెడికల్ కళాశాల భవనాలు

సీఎం పర్యటన సందర్భంగా జిల్లాకేంద్రంలో నిర్మించిన మెడికల్ కళాశాల నూతన భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. నల్లగొండకు 2019లో ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైంది. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్‌ఆసుపత్రికి అనుబంధంగా ఈ కళాశాల కొనసాగుతోంది. మెడికల్ కళాశాల భవనాలు, హాస్టళ్లను రూ.250కోట్లతో నల్లగొండ పట్టణ శివారులోని గంధంవారిగూడెం వద్ద 40ఎకరాల్లో నిర్మించారు. ఈ పనులు ఇటీవల పూర్తవడంతో భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రారంభించనున్నారు.

పలు పనులకు శ్రీకారం

సీఎం పర్యటన సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో రూ.110కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, రూ.100కోట్లతో లతీఫ్‌సాహెబ్ గుట్ట, బ్రహ్మంగారి గుట్టపైకి ఘాట్‌రోడ్ల నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

పవర్‌ప్లాంటు ప్రారంభోత్సవంపై రాని స్పష్టత

ప్రజాపాలన ఉత్సవాల్లోనే యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సైతం ప్రారంభిస్తారని తొలుత పేర్కొన్నా, ప్రస్తుత సీఎం పర్యటన షెడ్యూల్‌లో దీన్ని చేర్చలేదు. 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్లాంటులో మొదటి యూనిట్ ఇప్పటికే ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీంతో పాటు రైల్వేట్రాక్, బొగ్గు సరఫరా పనులకు ఇటీవలే గ్రీన్ సిగ్నల్ లభించింది. పవర్‌ప్లాంట్‌ను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించేందుకు అన్నివిధాలా సిద్ధం చేశారు. అయితే సీఎం పర్యటన తుది షెడ్యూల్ ఖరారైతే, యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవంపై స్పష్టత రానుంది.

నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన

మెడికల్ కళాశాల భవనం ప్రారంభోత్సవంతో పాటు రూ.40కోట్లతో నర్సింగ్ కళాశాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. గంధంవారిగూడెం వద్ద ఎస్‌ఎల్‌బీసీ స్థలంలో దీనికి భూకేటాయింపు చేశారు. అక్కడే నర్సింగ్ కళాశాల నిర్మించనున్నారు. అయితే నర్సింగ్ కళాశాలకు అధికారికంగా నిధుల కేటాయింపు చేయాల్సి ఉంది. ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న ఏటీఆర్ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్) సెంటర్‌ను కూడా సీఎం ప్రారంభించనున్నారు. నల్లగొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రత్యేకంగా ఆధునిక బ్రాంచ్‌లతో ఏటీఆర్‌ను నిర్మిస్తున్నారు. ఇక్కడ భవనాల నిర్మాణం, యంత్రాల బిగింపు పూర్తవడంతో వీటిని సీఎం ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులో తీసుకురానున్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు తేజ విద్యార్థిని ఎంపిక



డీఈవో అశోక్ నుంచి మెమెంటో అందుకుంటున్న క్షత్రజ్ఞరత్నం

కోదాడరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని తేజ విద్యాలయం విద్యార్థిని ఎంపికయ్యారు. 'రాష్ట్రస్థాయి పునరుత్పాదక శక్తి-వనరులు' అనే అంశంపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలభవనంలో గురువారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో కొమరబండ తేజ విద్యాలయ 9వ తరగతి విద్యార్థిని ఏ.క్షత్రజ్ఞ రత్నం ప్రథమస్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో డిసెంబరు 2న నిర్వహించే రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీకి ఎంపికైందని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. క్షత్రజ్ఞ రత్నంకు డీఈవో అశోక్, సెక్టోరియల్ అధికారి జనార్ధన్ ట్రోఫీని అందజేసినట్లు ఆమె తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మోతె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని రాఘవాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం జరిగింది. ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ. నాగుల్‌మీరా(32) భార్య, పిల్లలతో కలిసి ఆరు నెలల నుంచి మోతె మండలంలోని నామవరం గ్రామంలోని తన మామ సయ్యద్ మల్సూర్ ఇంట్లో ఉంటున్నాడు. సూర్యాపేట పట్టణ శివారు రాయిన్‌గూడెం గ్రామంలోని మహీంద్రా కారు షోరూంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన నాగుల్‌మీరా తన బావ కుమారుడి వివాహం కోసం ఖమ్మం వెళ్లాడు. పెళ్లి మరుసటి రోజు వలీమా డిన్నర్‌కు వెళ్లి మద్యం సేవించి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేశాడు. ఈ నెల 26వ తేదీన తిరిగి నామవరం గ్రామానికి వచ్చాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి ఆటోలో వెళ్లాడు. రాఘవాపురం క్రాస్‌రోడ్ సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వెనుక వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. నోటి నుంచి నురుగులు వస్తుండడంతో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నాగుల్‌మీరాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాగుల్‌మీరా సోదరుడు లాల మహమ్మద్ ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యపై హత్యాయత్నం కేసులో అరెస్టు

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పద్మట్‌పల్లి గ్రామంలో భార్యపై కత్తితో దాడిచేసి హత్యాయత్నం చేసిన ఘటనలో భర్తను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న కిన్నెర బాలరాజు మద్యానికి బానిసై వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం పత్తి ఏరేందుకు కూలికి వెళ్లిన భార్యపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలు అరుణ తమ్ముడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బాలరాజును అరెస్ట్‌చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం.. కాపర్ వైరు అపహరణ

గుండాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని గుర్జుబావి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరును దొంగిలించారు. గురువారం ఉదయం బావి వద్దకు వెళ్లిన తోటకూరి రాజు కొందరు రైతులకు సంబంధించిన మోటర్లు నడవకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరును ఎత్తుకెళ్లారని గమనించి వెంటనే ట్రాన్స్‌కో ఏఈ అంబాల నర్సింహులుకు సమాచారం ఇచ్చారు. ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అనంతరం విద్యుత్ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

360 కిలోల బెల్లం, 40 కిలోల పటిక స్వాధీనం

సూర్యాపేటరూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని జాటోత్‌తండాలో సూర్యాపేట ఎక్సైజ్ పోలీసులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. జాటోతు కౌసల్య ఇంట్లో నిల్వ ఉన్న 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను విచారించగా గ్రామానికి చెందిన వాంకుడోతు మురళీ వద్ద బెల్లం, పటిక కొనుగోలు చేస్తానని చెప్పింది. ఎక్సైజ్ పోలీసులు వెంటనే మురళీ ఇంటిపై దాడి చేసి 360 కిలోల బెల్లం, 40కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట ఎక్సైజ్ సీఐ మల్లయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శోభారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నార్కట్‌పల్లి, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. సంఘటన నల్లగొండ జిల్లా మండలకేంద్రం శివారు కామినేని ఆస్పత్రి సమీపంలో గురువారం జరిగింది. ఏఎస్‌ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాలకు చెందిన కేదరి వంశీ(21), గోపగోని రాములు ద్విచక్ర వాహనంపై నకిరేకల్ నుంచి చిట్యాలకు వస్తున్నారు. కామినేని ఆస్పత్రి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతిచెందాడు. గోపగోని రాముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కామినేని ఆస్పత్రికి తరలించారు. వంశీ సోదరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సూట్‌కేస్ తయారీ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



పరిశ్రమ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

చౌటుప్పల్ రూరల్, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ శివారులో సూట్‌కేస్ తయారీ పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్‌తో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బొర్రోళ్లగూడెం పరిధిలోని వింటో సూట్‌కేసు తయారీ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన పరిశ్రమ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, హయాత్‌నగర్ మండలాల నుంచి ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. సంఘటనా స్థలాన్ని సీఐ మన్మథకుమార్, ఎస్‌ఐలు యదవరెడ్డి, లక్ష్మయ్య పరిశీలించారు. సూట్‌కేస్ తయారీ సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. నష్టం వివరాలు తెలియరాలేదు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేతనాల కోసం ఎదురుచూపులు

» ఆరోగ్యమిత్రలకు నాలుగు నెలలుగా అందని వైనం » ఏజెన్సీ ఎంపికలో జాప్యంతో ఆలస్యం

ఆరోగ్యమిత్రలు నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీలో భాగంగా పనిచేస్తున్న వీరి పరిస్థితి అత్యంత దయనీయంగా మారుతోంది. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నిర్వాహకుల నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. కుటుంబాలను అప్పులతో నెట్టుకొస్తున్నారు. అధికారులు ఇదిగో వస్తున్నాయి, అదిగో వస్తున్నాయంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఎంపికలో జాప్యంతోనే ఆలస్యమంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. సూర్యాపేట జిల్లాలో 24 మంది ఆరోగ్యమిత్రలు ఉండగా వీరికి ఆగస్టు నుంచి వేతనాలు అందలేదు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట సిటీ)



సూర్యాపేట జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రాజీవ్ ఆరోగ్యశ్రీ నమోదు కేంద్రం

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం కింద చేరే రోగులకు ఆసుపత్రుల్లో సేవలు అందించేందుకు సూర్యాపేట జిల్లావ్యాప్తంగా 24మంది ఆరోగ్యమిత్రలు పనిచేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో వారిని ప్రభుత్వం నియమించింది. వీరికి నెలకు రూ.15,600లు చెల్లిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐలు పోను చేతికి నెలకు రూ.13,533లు వస్తున్నాయి. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని చాలాకాలం నుంచి ప్రభుత్వానికి, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ యాజమాన్యానికి ఆరోగ్యమిత్రలు వినతిపత్రాలు అందించినా అవి బుట్టదాఖలయ్యాయి. తమ కు వేతనాలు పెంచకపోయినా నెలవారీ వేతనాలనైనా సకాలంలో చెల్లించకపోవడంతో తమ జీవితాలు దుర్భరంగా మారాయని వాపోతున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడం తో అప్పులతో కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 24 మంది ఆరోగ్యమిత్రలకు కలిపి రూ.12,99,168లు వేతనాలు బకాయి ఉన్నాయి.

కలెక్టర్ సంతకం చేసినా..

ఆరోగ్యమిత్రల వేతనాలకు సంబంధించిన దస్త్రంపై కలెక్టర్ సంతకం చేసి నెలలు గడుస్తున్నా తమ వేతనాలు మంజూరు కావడం లేదని ఆరోగ్యమిత్రలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం కోసం ఇటీవల కొత్తగా అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఇదే తరహాలో ఆరోగ్యమిత్రలకు కూడా వేతనాలు చెల్లింపు కోసం అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని ఎంపికచేశారు. ఎంపికైన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి ఆరోగ్యమిత్ర వేతనాల దస్త్రం అందజేశారు. వారు ఆ దస్త్రాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా దస్త్రంపై కలెక్టర్ సంతకం చేశారు. సుమారుగా ఐదు నెలలు గడిచినా ఆరోగ్యమిత్రలకు వేతనాలు మంజూరు కావడం లేదు.

నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వలే

జిల్లావ్యాప్తంగా ఉన్న ఆరోగ్యమిత్రలకు ఆగస్టు నుంచి వేతనాలు ఇవ్వలేదు. వేతనాలు చెల్లించే అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని మార్చారని తెలిసింది. ఆరోగ్యమిత్రల వేతనాల ఫైల్‌పై కలెక్టర్ గతంలోనే సంతకాలు చేశారని అంటున్నారు. తమకు వేతనాలు ఇవ్వాల్సిన ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులు మా బాధలను పట్టించుకోవడం లేదు. నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలి.

- రమణ, ఆరోగ్యమిత్ర

ఏజెన్సీ ఎంపికలో జాప్యం వల్లే ఆలస్యం

ఆరోగ్యమిత్రలకు వేతనాల మంజూరు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ బాధ్యత. జిల్లాలో ఏజెన్సీ టెండర్ల ఎంపిక ఆలస్యం కావడంతో ఆరోగ్యమిత్రలకు సకాలంలో వేతనాలు మంజూరుకాలేదు. గతంలోని అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఆరోగ్యమిత్రలకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించలేదు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు వేతనాలకు సంబంధించిన ఫైల్‌ను అందజేశాం. అతికొద్ది రోజుల్లోనే ఆరోగ్యమిత్రలకు వేతనాలు మంజూరవుతాయి.

- వంశీ కృష్ణ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉమ్మడి జిల్లా మేనేజర్.

శాపంగా ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్వాహకుల తీరు

రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు నిర్వాహకుల తీరు ఆరోగ్యమిత్రల పాలిట శాపంగా మారింది. సకాలంలో వేతనాలను మంజూరు చేయడంలో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్, నియోజకవర్గ టీం లీడర్ల కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రతి నెలా చివరి వారంలో ఆరోగ్యమిత్రల విధుల వివరాలు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసి, వారి వేతనాల రిజిష్టర్‌ను ఉన్నతాధికారులకు నివేదించడం ఆరోగ్యశ్రీ టీం లీడర్ల బాధ్యత. అయితే ఏ రోజు కూడా ఆరోగ్యశ్రీ టీం లీడర్లు క్షేత్రస్థాయిలో కనిపించరని ఆరోగ్యమిత్రలు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఒక్కరే మేనేజర్ ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యకైంకర్యాలు

భువనగిరి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులను అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమపూజలు చేశారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. కాగా, 830 జంటలు సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో పాల్గొన్నారు.

నేడు గిరిప్రదక్షిణ

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం గిరిప్రదక్షిణ చేపట్టనున్నారు. ఆలయంలో వేకువజామున మూలవర్యులకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహిస్తారు. కొండకింద వైకుంఠద్వారం వద్ద ఉదయం 5.30గంటలకు గిరిప్రదక్షిణను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ ఎం.హనుమంతరావు ప్రారంభించనున్నారు. అనంతరం కొండచుట్టూ సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర 45నిమిషాలపాటు గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు స్థానికులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి గురువారం రాత్రే భక్తులు యాదగిరిగుట్టకు చేరుకున్నారు. అదేవిధంగా స్వామివారి గోశాలలో శుక్రవారం వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురం దేవస్థాన గోశాలలో ఏటా తులసీ దామోదర కల్యాణం, సత్యనారాయణస్వామి వ్రతంతోపాటు కార్తీక మాసం చివరి వారంలో వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



నిత్యకల్యాణంలో భాగంగా ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుపై రగడ

చిలుకూరు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రామాపురంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహ వ్యవహారం వివాదం నెలకొంది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం కన్పించకుండా ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొలగించాలని కాంగ్రెస్ నాయకులు గురువారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబు, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు గ్రామానికి చేరుకుని గ్రామపెద్దలతో మంతనాలు జరిపారు. గ్రామానికి చెందిన కొందరు విగ్రహం తొలగించవద్దని, మరికొంత మంది ఆంజనేయస్వామి విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించాలని పట్టుబట్టడంతో పోలీసులు, అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. విగ్రహం తొలగింపు కోసం పోలీసులు, అధికారులు చర్చలు జరుపుతుండగానే మరోపక్క కోదాడ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహం వద్దకు ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ధర్మపరిరక్షణ సభ్యులు, అయ్యప్పస్వామి భక్తులు, మహిళలు పెద్దఎత్తున చేరుకున్నారు. అక్కడే పూజా కార్యక్రమాలు నిర్వహించి, భజనలు చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హిందువులపై పోలీసుల దౌర్జన్యం నశించాలని భక్తులు నినాదాలు చేయడంతో పోలీసులు, అధికారులు అక్కడినుంచి వెళ్లిపోయారు. గ్రామంలో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించడానికి వీలులేదని, విగ్రహాన్ని తొలగించే ప్రయత్నం చేస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



రామాపురంలో ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భజనలు చేస్తున్న భక్తులు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.138	210	240
సూర్యాపేట	రూ.125	190	210
నల్లగొండ	రూ.130	190	220

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	587.70
టీఎంసీలు	305.7464
ఎడమకాల్వకు నీటి విడుదల	5,654
కుడికాల్వకు	9,160
విద్యుత్ కేంద్రం ద్వారా	12,830
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	35,315
అవుట్‌ఫ్లో	30,315క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	44.64 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	300 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.38
ప్రస్తుత నీటి మట్టం	644.70 అడుగులు
టీఎంసీలు	4.38
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	168.89 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	167.33 క్యూసెక్కులు

క్యాంపస్ సమాచారం

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్లగొండ, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో పరిధిలో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సీవోఈ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షలు సజావుగా నిర్వహించాలని కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచనలు చేశారు.

రోడ్డుపై చెత్త వేసినందుకు రూ.2వేలు జరిమానా

భువనగిరి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుకాణంలో ఉత్పత్తి అయిన చెత్తను రోడ్డుపై వేసినందుకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ అధికారులు దుకాణం యజమానికి జరిమానా విధించారు. మునిసిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి గురువారం ఉదయం పట్టణంలోని రహదారులను పరిశీలిస్తున్న క్రమంలో భువనగిరిలోని గణపతి టెక్స్‌టైల్స్ దుకాణ సిబ్బంది దుకాణంలోని చెత్తను రోడ్డుపై వేస్తుండగా ఆయన గమనించారు. వారిని మందలించి దుకాణ యజమానికి రూ.2వేలు జరిమానా విధించారు. దుకాణాల్లోని చెత్తను మునిసిపల్ చెత్త సేకరణ సిబ్బంది అందించాలని సూచించారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

చిలుకూరు, నవంబరు 28,(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్‌లో ఉన్న వరిగడ్డి దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని సబ్బేరిగూడెం సమీపంలో గురువారం జరిగింది. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన పొదిలి సైదులుకు చెందిన వరి పొలం బేతవోలు శివారులో ఉంది. ఆ వరి పొలం నుంచి గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధమైంది. నాలుగు ఎకరాల గడ్డి, ట్రాక్టర్ ట్రాలీ దగ్ధమైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సంఘం నాయకుడు శ్రీశైలం

మర్రిగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తిదారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతి వృత్తిదారులకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల్లో వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో వృత్తులను నమ్ముకొని జీవిస్తున్న ఎందరో చేతివృత్తిదారులు వృత్తి కోల్పోయి ఉపాధి లేక వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యం చేశాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున మాట్లాడుతూ బడుగులకు విద్య నేర్పిన ఆశాజ్యోతి, అణగారిన వర్గాల అక్షర దీపం మహాత్మా జ్యోతిరావుఫూలే అని అన్నారు. మహాత్మాజ్యోతి ఫూలే వర్ధంతి సందర్భంగా మర్రిగూడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ అధ్యక్షుడు నాగార్జునచారి, ఏర్పుల యాదయ్య, వీరమల్ల ముత్యాలుగౌడ్, వెంకటయ్య, రాధాకృష్ణ, అంజయ్య, కృష్ణమాచారి తదితరులు పాల్గన్నారు.

మత్స్యకారుల ప్రోత్సాహానికి..

» కేంద్ర ప్రభుత్వ మత్స్య సంపద పథకం
» మత్స్య కారుల జీవనోపాధికి దోహదం
» వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



మత్స్య సంపదను రెట్టింపు చేస్తూ మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై)ప్రవేశ పెట్టింది. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను కల్పించి మత్స్య సంపదను పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. పథకం లబ్ధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవ కాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

(ఆంధ్రజ్యోతి- భూదాన్‌పోచంపల్లి)

మత్స్యరంగానికి సంబంధించిన ఇతర వ్యక్తులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. మత్స్యకారులు, మత్స్యకార్మికులు, చేపల విక్రయదారులు, మత్స్య అభివృద్ధి కార్పొరేషన్లు, స్వయం సహాయక సంఘాలు, మత్స్యరంగం, మత్స్య సహకార సంఘాలు, మత్స్యకారుల సంఘాలు, ప్రైవేటు సంస్థలు సైతం ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు. చేపల పెంపకానికి నాణ్యమైన సీడ్ సేకరణ, నీటి నిర్వహణ ఈపథకం ద్వారా కల్పిస్తారు.

8 రకాల యూనిట్లు

పీఎంఎంఎస్‌వై పథకం కింద 8 రకాల యూనిట్లను ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మంచినీటి నిర్వహణకు హెచ్‌రీలు, చేపల పెంపకానికి పాండ్స్ నిర్మాణం, రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్, జలాశయంలో చేపల పెంపకం, ఇన్సులేటెడ్ వాహనాలు, మూడు చక్రాల వాహనాల సరఫరా, చిన్న తరహా చేపల దాణా మిల్లుల ఏర్పాటు, మొబైల్ ఫిష్ అవుట్ లెట్లు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు అందించనుంది.

రిజిస్ట్రేషన్ ఇలా..

ఆధార్‌కార్డు, ఫోన్ నంబరుతో సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. https://pmmsy.dof.gov.in/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. తదుపరి యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం మత్స్య శాఖ అధికారులు విచారణ చేసి పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మత్స్య పారిశ్రామిక రంగంలో ఉన్నవారు దరఖాస్తుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించు కోవాల్సి ఉంటుంది. అర్హులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- ఎం. గంగాధర్, మత్స్య శాఖాధికారి, యాదాద్రి-భువనగిరి జిల్లా

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SAPAVATH BHARATHI As per Passport No. Y7397587 W/O Late SABAVATH BALU Residing At 2-132, Jethya thanda, Bogguladona Post, Gundlapally Mandal, Nalgonda Dist. I have Changed my Name to SABAVATH BHARATHI As per Adhar Card No: 584256794154 also Pan Card No: NAIPS8757R and As per Affidavit no-39AA688607 Dt-23/11/2024 for all future purposes.
AJH-32483

CHANGE OF NAME

★ I, SAPAVATH BHARATHI W/O Late SAPAVATH BALAJI As per Passport No. Y7397587, Residing At 2-132, Jethya thanda, Bogguladona Post, Gundlapally Mandal, Nalgonda Dist. I have changed my husband's name from Late SABAVATH BALOJI as per Death Certificate No: 66419903 and my passport No: Y7398587 BALAJI SAPAVATH to Late SABAVATH BALU As per my Adhar Card No:584256794154. As per Affidavit no- 39AA688606 Dt-23/11/2014 for all future purposes.
AJH-32481

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/- Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413365 9985413656
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 9985410384

స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

నాగారం, నవంబరు 28: నాగారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు) ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వై.సోమచారిని కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ సస్పెండ్ చేశారు. సోమాచారి గతంలో నాగారం ఎస్సీ బాలుర హాస్టల్‌లో వార్డెన్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించారు. ఆ సమయంలో విధులు సక్రమంగా నిర్వహించడంలేదని విద్యార్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో అశోక్ విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దంతో కలెక్టర్ సోమచారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో అశోక్ తెలిపారు.

తహసీల్దార్‌గా హరిశ్చంద్రప్రసాద్

ఆత్మకూర్(ఎస్),నవంబరు28(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్‌గా హరిశ్చంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలంగా తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. దీంతో ఆత్మకూర్(ఎస్)లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న హరిశ్చంద్ర ప్రసాద్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ తేజస్ నందలాల్ ఆదేశాలు జారీ చేశారు.

ఉర్సును ప్రశాంతంగా జరుపుకోవాలి

అర్వపల్లి,నవంబరు28(ఆంధ్రజ్యోతి): హజ్రత్ ఖాజానసీరోద్దీన్‌బాబా దర్గా ఉర్సును ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ మహిముద్దీన్, ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెం మండలం లోని అర్వపల్లి దర్గా ఉర్సు ఏర్పాట్ల పనులను వారు పరిశీలించి వారు మాట్లాడారు. హిందూ-ముస్లిం మతసామరస్యానికి దర్గా ప్రతీకగా నిలిచిందన్నారు కార్యక్రమంలో అలీ, మహబూబ్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కోదాడటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు చెల్లించాలని కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేయటంతో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. గురువారం కోదాడలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన నర్గెస్ ఫర్వీన్ కోదాడలోని ఓ నర్సింగ్ కళాశాల హాస్టల్‌లోనే ఉంటూ బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఫర్వీన్ కళాశాలలో చేరే సమయంలో రూ.3.75 లక్షలకు ఫీజు మాట్లాడుకోగా ఇంకా రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయటంతో మనోవేదనకు గురై విద్యార్థిని శానిటైజర్ తాగింది. గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. ఈ సంఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు కోదాడ టౌన్ ఎస్ రంజిత్‌రెడ్డి తెలిపారు.

డ్రైవర్ల వేతనాలు పెంచాలి

హుజూర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లు డ్రైవర్ల వేతనాలు పెంచాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శీతల రోషపతి కోరారు. గురువారం పట్టణంలో రైస్‌మిల్లు డ్రైవర్ల వేతనాలు పెంచాలని మిల్లర్లకు నోటీసులు ఇచ్చారు. వేతన ఒప్పందాల ప్రకారం డ్రైవర్లకు వేతనాలు పెంచాలన్నారు. లేని యెడల సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పొలిశెట్టి నర్సింహారావు, వెంకన్న, రామయ్య, శ్రీను, అంజయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

హుజూర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని మార్కెట్‌కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు మార్కెట్ గోదాంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలన్నారు. ఈ ఏడాది 17 మంది రైతులు 4,250 బస్తాల ధాన్యాన్ని నిల్వ చేసినట్లు తెలిపారు. గత ఏడాది 74 మంది రైతులు 15,768 బస్తాల ధాన్యాన్ని నిల్వ చేసుకోగా ధాన్యం ధర పెరిగిన తర్వాత గిట్టుబాటు ధరకు విక్రయించారని తెలిపారు.

డిసెంబరు 1న సింహగర్జన

హుజూర్‌నగర్ రూరల్, నవంబరు 28: హైదరాబాద్‌లో డిసెంబరు 1 జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బాబూరావు కోరారు. గురువారం పట్టణంలోని తిలక్‌నగర్‌లో సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

భవనానికి శంకుస్థాపన

సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 28, ఆంధ్రజ్యోతి: భావితరాలకు ఉపయోగపడేలా సూర్యాపేట లయన్స్ సర్వీస్ సెంటర్ భవనాన్ని నిర్మించాలని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో లయన్స్ సర్వీస్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆస్పత్రి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, సుధాకర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ మీలా మహదేవ్, ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా వాసుదేవ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

అర్వపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందజేయాలని ఎంఈవో బాలునాయక్ అన్నారు. గురువారం జాజిరెడ్డిగూడెం మండల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ విద్యార్థులతో కలిసి భోజనం చేసి మాట్లాడారు. ఈ. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ప్రమాదాలు

- భయంగా మారిన సూర్యాపేట-ఖమ్మం 365 బీబీ జాతీయ రహదారిలో ప్రయాణం
- అండర్‌పాస్ వంతెనల వద్ద నిత్యం ప్రమాదాలు
- పూర్తిగాని జంక్షన్ల నిర్మాణం



నామవరం క్రాస్‌రోడ్ వద్ద వంతెన ఆనుకుని నిర్మిస్తున్న ఇళ్లు నిర్మాణాలు చేపడుతున్న ఇండ్లు

సూర్యాపేట-ఖమ్మం 365బీబీ జాతీయ రహదారిలో నిత్యం మృత్యుఘంటికలు మోగుతున్నాయి. ఈ రోడ్డును రెండేళ్ల క్రితం జాతీయ రహదారిగా మార్చినా ప్రమాదాలు తగ్గలేదు. ఈ రోడ్డు పనుల కాంట్రాక్టుకు చేజిక్కించుకున్న కంపెనీ నేటికి అండర్ పాస్‌ల వద్ద జంక్షన్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనందున ప్రమాదాలు జరుగుతున్నాయి.
- మోతె (ఆంధ్రజ్యోతి)

సూర్యాపేట-ఖమ్మం 365 బీబీ జాతీయ రహదారి 58కిలో మీటర్ల పరిధిలో ఉంది. ఈ గ్రీన్ కారిడార్‌లో పక్కనున్న గ్రామాల అనుసంధానం కోసం పలు ప్రాంతాల్లో వంతెనలు, సర్వీసు రోడ్లు నిర్మించారు. సర్వీస్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను ఎన్‌ఎచ్‌ఏఐ విస్మరించినందున ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో అండర్‌పాస్‌ల వద్ద రోడ్డుకు రెండు వైపులా జంక్షన్లను ఏర్పాటు చేయనందున జాతీయ రహదారి నుంచి కిందకు వస్తున్న వాహనాల డ్రైవర్లకు అవతలి వాహనం కనిపించడంలేదు. దీంతో భారీ ప్రమాదాలు జరుగుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

జాతీయ రహదారి నిబంధనల పేరిట తెల్లని రంగుతో మూడు సెంటీమీటర్ల మందంతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. సర్వీసు రోడ్లకు ఏర్పాటు చేసినా వాహనాల వేగాన్ని నియంత్రించే పరిస్థితి లేదు. గత సంవత్సరం ఫిబ్రవరి 28న మోతె మండల కేంద్రంలోని కేశవాపురం గ్రామానికి వెళ్లే అండర్ పాస్ వద్ద వేగంగా వస్తున్న మిరప కూలీల ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఆరుగు రు అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. మామిళ్లగూడెం అండర్‌పాస్ వద్ద మ రో ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.గత 10 నెలల కాలంలో మండల పరిధిలో 20మంది మృత్యువాత పడ్డారు. పలువురు క్షతగాత్రులలయ్యారు.

కనిపించని వెహికిల్ టర్నింగ్ రేడియస్ (జంక్షన్లు)

ఈ నాలుగు వరుసల జాతీయ రహదారిలో మొత్తం 21 అండర్ పాస్‌లు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో జంక్షన్లను ఏర్పాటు చేయలేదు. మోతె మండలంలో ఐదు పెద్ద అండర్ పాస్‌లు ఉన్నప్పటికీ ఏ ఒక్క ప్రాంతంల్లో జంక్షన్లను నిర్మించలేదు. దీంతో ఈ వంతెనల వద్ద నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతోంది. వీటికి తోడు చందుపట్ల, నామవరం, మామిళ్లగూడెం, గ్రామాల పరిధిలో ఉన్న అండర్ పాస్‌ల కింద వాహనాలను పార్క్ చేయడం. బడ్డీ కొట్లను ఏర్పాటు చేయడంతో వాహనాలు అంత తేలికగా మలుపు తిరగక ట్రాఫిక్ జాం ఏర్పడుతున్నందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలకు వెళ్లడానికి అండర్ పాస్‌ల వద్ద సూచిక బోర్డులను జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేయాలి. ఏదో మొక్కుబడిగా కొన్ని ప్రాంతాల్లోనే ఈ సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాలకు వెళ్లడానికి వాహనదారులు తికమక పడుతున్నారు. అండర్ పాస్ నుంచి రెండు వైపులా 10గ్రామాలు ఉన్నాయి. మామిళ్లగూడెం అండర్ వంతెన వద్ద జంక్షన్ల నిర్మాణం కోసం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్నవారికి నష్టపరిహారం కూడా చెల్లించారు. కొన్ని అండర్ పాస్‌ల ప్రాంతంలో ఇచ్చిన నష్టపరిహారం సరిపోదని, అధికంగా చెల్లించాలి ఇళ్లు కోల్పోయిన బాధితులు కోర్టుల్లో కేసులు వేశారు. మామిళ్లగూడెం(సింగరేణిపల్లి) టోల్ ప్లాజా ఉన్న ప్రాంతంలో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణ సమయంలో పాత వంతెనను తొలగించనందున అక్కడి నుంచి పలు వాహనదారులు వెళుతున్నాయి. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలుభయపడుతున్నారు.

అందుబాటులో అంబులెన్స్ సౌకర్యం

ఈ 59 కిలోమీటర్ల పరిధిలో నిత్యం రెండు అంబులెన్సులు, రెండు పెట్రోలింగ్ వాహనాలు, రెండు క్రేన్‌లు అందుబాటులో ఉన్నాయి. సుమారు 40 మంది పైబడే సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఈ జాతీయ రహదారిపై ఏచోట ప్రమాదం జరిగినా వాహనదారులు 1033 టోల్‌ఫ్రీ నెంబరు కాల్‌చేస్తే అంబులెన్స్ వస్తుంది. ఈ జాతీయ రహదారి పరిధిలో ప్రతి కిలోమీటరుకు ఒక చోట 1033 నెంబరుకు కాల్‌చేసేందుకు ఫోన్ బాక్సులను ఏర్పాటు చేశారు.

జంక్షన్లు ఏర్పాటు చేయాలి



మోతె మండలం నామవరం క్రాస్‌రోడ్ వద్ద, మామిళ్లగూడెం అండర్ పాస్‌ల వద్ద జంక్షన్లను నిర్మించాలి. నామవరం క్రాస్‌రోడ్ వద్ద రెండు వైపులా ఉన్న వంతెనకు సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇళ్లను నిర్మించారు. దీంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- బైరి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త

అండర్ పాస్‌ల వద్ద వాహనాలు నిలిపితే చర్యలు

అండర్‌పాస్‌ల వద్ద వాహనాలు నిలపడంతో వాహన రద్దీ పెరిగింది. వంతెన వెంబడి కొన్ని ప్రాంతాల్లో జంక్షన్లను నిర్మించాల్సి ఉంది. ఉన్నతాకారుల నిర్ణయంతో పనులు చేపడుతాం
- జాతీయ రహదారి ప్రతినిధి

పద్మశాలీల అభ్యున్నతికి సహకరించాలి



కమిటీ సభ్యులో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కమర్తపు మురళి

సూర్యాపేట టౌన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో ఆ సంఘం పట్టణ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడారు. దేశంలోనే ప్రథమంగా కుల సంఘాల్లో పద్మశాలీ సంఘం ఏర్పడిందన్నారు. రాజకీయ పార్టీలు పద్మశాలీలకు అవకాశం కల్పించాలన్నారు. పద్మశాలీలు ఆర్థికంగా బలంగా లేనందున అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. పద్మశాలీ కుల స్థులకు గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న నిధులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లా కేంద్రంలో కొండ లక్ష్మణ్‌బాపూజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం గుర్తించామని, ప్రభుత్వం సహకరించి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్షుడు మిట్టకోల సతీష్, ఉపాధ్యక్షులు కోట వీరయ్య, గంజి శ్రీనివాస్, తలిశెట్టి శ్రీనివాస్, తలిశెట్టి మారుతి, ప్రధాన కార్యదర్శి ఏలె ప్రభాకర్, సహాయ కార్యదర్శి పరకాల శ్రీనివాస్, కేతం వెంకన్న, పరకాల ప్రవీణ్, రెబ్బ శ్రీనివాస్, కోశాధికారిగా మిట్టకోల మధుబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు షఫీవుల్లా, వెలుగు వెంకన్న, నాయకులు మాచర్ల రాంచంద్రరావు, నక్క రమాదేవి, నాగుల వాసు, సైదులు, చందా హేమలత, బొడ్డు గోవిందరావు, గుర్రం నగేష్, చిలువేరు సతీష్, ఏలె ప్రబాకర్, మిట్టకోల మధు, మూశం వెంకటనారాయణ, వేణుగోపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు

మఠంపల్లి, నవంబరు 28: మండలంలోని చౌటపల్లి గ్రామంలో రోడ్డు గుంతలమయంగా మారడంతో దుమ్ము, ధూళి ఇళ్లల్లోకి వచ్చి రోగాల బారినపడుతున్నామని వచ్చి ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మట్టపల్లి- హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారిలో కొన్ని నెలల క్రితం గుంతలు పడ్డాయన్నారు. ఆ గుంతల్లో అధికారులు ఇటీవల కంకర చిప్స్ పోశారన్నారు. ఈ రహదారి నుంచి లారీలు, ఇతర వాహనాలు వెళుతున్నందున దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి, మండల ప్రత్యేకాధికారులు స్పందించి సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



చౌటపల్లిలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

బ్యాంకు మిత్రపై అధికారులు చర్యలు తీసుకోవాలి



మోతెలోని ఏపీజీవీబీ ఎదుట ధర్నా చేస్తున్న మహిళాసంఘం సభ్యులు

మోతె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ పొదుపు డబ్బును బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్న బ్యాంకు మిత్రపై అధికారులు చర్యలు తీసుకోవాని మహిళా సంఘాల సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం మోతెలోని ఆంధ్రప్రదేశ్ చైతన్య గ్రామీణ బ్యాంక్ (పీపీజీ వీబీ) ఎదుట మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం సభ్యులు నిమ్మరబోయిన కవిత, రావుల గంగమ్మతో పాటు మిగిలిన సంఘాల అధ్యక్షులు మాట్లాడారు. మోతె మండలం బుర్కచర్ల గ్రామానికి చెందిన ఐదు సంఘాల సభ్యుల 60మంది పొదుపు డబ్బులత పాటు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును తమతో బ్యాంకు మిత్ర అనంతుల రవి వేలిముద్ర వేయించుకుని డబ్బులు డ్రా చేసి సొంతానికి వినియోగించు కున్నారని తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 21వ తేదీన పిర్యాదు చేసిన ఎస్ఐ పట్టించుకోలేదన్నారు.. బ్యాంకు మేనేజరుకు పిర్యాదు చేయగా మూడు రోజుల క్రితం పొదుపు సొమ్మును కొద్దిమేర మాత్రమే జమ చేశాడన్నారు శ్రీచైతన్య సంఘానికి రెండు నెలల పొదుపు డబ్బు రూ.77 వేలు, ఝాన్సీలక్ష్మీబాయి సంఘానికి రూ.25వేలతో పాటు వడ్డీ చెల్లించాల్సి ఉందన్నారు. అడిగినా పట్టించుకోనందున ధర్నాకు దిగామన్నారు. బ్యాంకుమిత్రపై చర్యలు చేపట్టాలని రెండు గంటలకు పైబడి ధర్నా చేసినా మేనేజర్ పట్టించుకోనందున మధ్యాహ్నం భోజనం మేనేజరుతో మహిళలు వాగ్వివాదానికి దిగారు. ఈ విషయమై మేనేజరు సురేష్‌ను వివరణ కోరగా, అక్రమాలకు పాల్పడినట్లు వివరాలు ఇస్తే బ్యాంకుమిత్రను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు నిమ్మరబోయిన కవిత, బుచ్చమ్మ, రావుల గంగమ్మ, సామ్రాజ్యం పాల్గొన్నారు.

డబ్బులు స్వాహా చేసిన వీబీకే

మద్దిరాల,(ఆంధ్రజ్యోతి): సమభావన సంఘాలు, స్త్రీనిధి డబ్బులు స్వాహా చేసిన విలేజ్ బుక్ కీపర్ (వీబీకే) అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. మండంలోని గోరెంట్ల గ్రామానికి చెందిన మహిళ సంఘాల సభ్యులు గురువారం మద్దిరాలలోని వెలుగు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. గ్రామానికి చెందిన వీబీకే రూ.28లక్షలు స్వాహా చేసిందన్నారు. వీబీకేతో పాటు ఆమెకు సహకరించిన అధికారులపై నేటి వరకు చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వీబీకే, అధికారులపై మద్దిరాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పాల్వాయి కవిత, తాటిపాముల ధనమ్మ, జలగం అనిత, సోమలక్ష్మి, వెంకటమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూలే జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

సూర్యాపేటటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహత్మ జ్యోతిరావుపూలే జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ, పద్మశాలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు అన్నారు. మహత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా గురు వారం జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపతి నారాయణగౌడ్, నిద్ర సంపత్‌నాయుడు, దూలం నగేష్, సుదర్శన్, కీర్తి వెంకటేశ్వర్లు, మిట్టకోల యుగేందర్ పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సూర్యాపేటలో పూలే విగ్రహానికి ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, రాజు, వేణు, సందీప్, వినయ్, నవీన్, మహేష్, ప్రదీప్, శ్రీను పాల్గొన్నారు.

● కోదాడ టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌చౌక్ చౌరస్తాలో పూలే విగ్రహ కమిటీ అధ్యక్షుడు పాలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ ప్రతినిధి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ పారా సీతయ్యలు పూలమాల వేసి నివాళులర్పించారు.

● నేరేడుచర్ల, అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం, మద్దిరాల, నూతనకల్, తుంగతుర్తి, పెన్‌పహాడ్, మోతె, హుజూరనగర్, తదితర మండలాల్లో పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సూర్యాపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దివ్యాంగుల హామీలను నెరవేర్చాలి

సూర్యాపేట అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని దివ్యాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీం అన్నారు. దివ్యాంగుల పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట ఆందోళన నిర్వహించి మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు దివ్యాంగుల పింఛన్ రూ.4,016 నుంచి రూ.6వేలకు పెంచుతామన్న హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఆ హామీలను నెరవేర్చక పోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వల్లపు లింగయ్య, బైరు వెంకన్న, రవిగౌడ్, రాజశేఖర్, షమీమ్, సుల్తానా, రమణ పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లు ఇవ్వాలి

నేరేడుచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ప్రభుత్వ పింఛన్లు ఇవ్వాలని బీఆర్‌ఎస్ నాయకుడు రాపోలు నవీన్ కోరారు. గురువారం దిర్శించర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పింఛన్‌దారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పింఛన్లు పెంచుతామని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పింఛనును కూడా సకాలంగా ఇవ్వలేకపోతున్నారని ఆయన విమర్శించారు.

బోధన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

మోతె, మునగాల, నవంబరు 28: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల్లో బోధన సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి శ్రీదేవితో కోరారు. గురువారం మోతె మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న బోజన విరామ సమయంలో సిబ్బంది పాటు నిరసన తెలిపి మాట్లాడారు చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని, జీవించడానికి ఇబ్బందిగా ఉన్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంధ్యాదేవి, రజిని, శైలజ, యల్లమ్మ, కోటేశ్వరి, శ్రీలక్ష్మి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులకు టైమ్ స్కేల్ ప్రభుత్వం అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాండు రంగాచారి డిమాండ్ చేశారు. మునగాలలోని కస్తూర్బా పాఠశాలలో నిరసన తెలిపి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వై.విక్రమ్‌రెడ్డి, కే.విజయ నిర్మల ఎస్‌వో రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాలొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసు అధికారులు

హుజూర్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ ముత్తయ్య, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణారావు కోరారు. గురువారం పట్టణంలో శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో 'సేఫ్ ఇండియా' అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు మోటార్ సైకిళ్లు ఇవ్వవద్దన్నారు. వాహనదారులకు గులాబీ పూలు అందించి హెల్మెట్ ధరించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జుట్టుకొండ రమేష్, ప్రేమ్‌సార్, రాంప్రసాద్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేటఅర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 సంఘాలు క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పెదపంగు కవిత, పాస్టర్ సుధాకర్, జాన్‌సుమిత్ర, మర్రి నేహేమియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఔదార్యం

నూతన్‌కల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల వ్యవధిలో భర్తను, కుమారుడి కోల్పోయిన మహిళకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన వంతు సాయం అందించి ఔదార్యం చాటారు. మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన పోలోజు రుక్మాచారి, ఆయన కుమారుడు మహేష్ అక్టోబరులో మృతి చెందారు. రుక్మాచారి బార్య విజయలక్ష్మి అద్దె ఇంట్లో ఉండి జీవనం సాగిస్తోంది.విషయం తెలుసుకున్న అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించే సామ సవేందర్‌రెడ్డి భగత్‌సింగ్ యూత్ సభ్యులతో కలసి గురువారం క్వింటా బియ్యం, రూ.16వేలను విజయలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అనంతుల మహేష్, కొంగల నరేష్, గుండా భరత్, చలిగంటి రామకృష్ణ, జలగం గౌతమ్, దేవరకొండ మహేష్ ఉన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నేరేడుచర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేద విద్యార్థులు 25 మందికి మిర్యాలగూడ సుప్రియ రెడీమెడ్ డ్రెస్సెస్ షాపు యజమాని అల్లాని సతీష్ రూ.15వేలవిలువైన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, జోన్ చైర్మన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, కందిబండ శ్రీనివాసరావు, చిత్రం విశ్వనాథ్, నెమ్మాది వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన కార్యదర్శులు అరెస్టు

నూతన్‌కల్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): కల్యాణ లక్ష్మి పథకంలో అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శులను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వివాహాలు జరిగిన వారి పేరిట 2023, 2024 సంవత్సరాల్లో వివాహాలు జరిగినట్లు మాచనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన వెన్న వెంకట్‌రెడ్డి, మిర్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఏషమోల్ల అనిల్, మాచనపల్లి గ్రామానికి చెందిన మట్టిపల్లి సందీప్‌లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించారన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో 10మంది లబ్ధిదారుల పేరిట రూ.10లక్షలు స్వాహా చేశారన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పిర్యాదు మేరకు ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా, ముగ్గురికీ 14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పు వచ్చినట్లు ఆయన తెలిపారు